

# విడాకులు

కవనశర్మ

ఆటోలో వెళుతున్న సుజాత గాలికి నుదుటి మీద పడుతున్న జుట్టును చేత్తో వెనక్కి తోసుకుంది మరోసారి. కొద్ది క్షణాల్లో మళ్లీ వెంట్రుకలు వచ్చి నుదుటి మీద వాలాయి. మనసులో ముసురుతున్న ఆలోచనల్ని ప్రయత్నించి వెనక్కి నెట్టినా అవి మళ్లీ వచ్చి వాలుతున్నాయి.

తను చూడబోతున్న లాయరు తన సమస్యను తన కోణం నుంచి చూస్తాడో, చూడడో! చూడకపోతే ఆశ్చర్యంలేదు. మొగుడూ, అత్తా, మామా సరే - ఆఖరికి ఆమె తల్లీ, తండ్రీ కూడా ఆమెదే తప్పన్నారు. అందుకే సందర్భం చెప్పకుండా లాయరు దక్షిణామూర్తిని అడిగి సమయం తీసుకుంది. తన సమస్యకి తను కోరే పరిష్కారం సరైనదేనని ఆమె నమ్ముతోంది. లాయర్ని నమ్మించాలి. ఇంతకు ముందు ఆమె కలుసుకొన్న ముగ్గురు లాయర్లూ ఆమెకు వారు హితవనుకొన్నది బోధించి బోధించి వదిలిపెట్టారు. అందుకే ఆమెకి అధైర్యంగా ఉంది. కథకుడు కథ మొదలుపెట్టేటప్పుడు 'ఇల్లాగా? లేక మరోలా బావుంటుందా? అని రకరకాలుగా వ్రాసి చూసుకొన్నట్టు, లాయరు దక్షిణామూర్తికి తన కేసు ఎలా ప్రెజెంట్ చేస్తే బావుంటుందని రకరకాలుగా రిహార్సల్స్ వేసుకుని చూసుకుంది మనసులో. ఆఖరికి ఏదీ నచ్చక విసుగువచ్చి అక్కడ ఎల్లా నోటికి వస్తే అల్లా చెప్పాలన్న నిర్ణయానికి వచ్చి మనస్సుకి విశ్రాంతి ఇవ్వబోయింది. కానీ ఆమె మనస్సుకు గుచ్చుకున్న ములుకులు ఆమెను బాధించడం మానలేదు.

ఆటో 'దక్షిణామూర్తి, అడ్వొకేట్' అని బోర్డున్న ఇంటి ముందర ఆగింది. సుజాత ఆటోకి డబ్బిచ్చి లోపలికి నడిచింది. ఇల్లు అధునాతనంగాను, చక్కని అభిరుచితోను కట్టబడింది. ధన ప్రకర్షకోసం చేసే హంగులు లేవు అనుకుంది ఆమె.

ఆమె గుమాస్తాతో తాను ఎవరో చెప్పింది.

"లాయర్‌గారు మీకోసం ఎదురుచూస్తున్నారు. లోపలికి వెళ్లండి." అని, ఆమెను లోపలికి పంపాడు.

రూమ్‌లోకి అడుగుపెట్టగానే అది ఎ.సి. రూమ్ అని గ్రహించింది. చుట్టూ బల్బులు పెట్టిన పెద్ద వేంకటేశ్వరస్వామి ఫోటో ఏ గోడకైనా తగిలించి ఉందేమోనని చూసింది. అటువంటిది లేకపోవడం ఆమెకి ధైర్యం కలిగించింది. ఆమె అత్తవారింట్లో అటువంటిది ఒకటి ఉంది. ఆమె ఆ ఫోటోని ఒకరకపు సంస్కారంతో ముడిపెట్టుకుంటుంది. ఆ సంస్కారం పట్ల ఆమెకి భయం.

"నేను సుజాతని," అంది నమస్కారం పెడుతూ.

"దక్షిణామూర్తి," అన్నాడు దక్షిణామూర్తి లేచి నిలబడి ప్రతి నమస్కారం పెడుతూ. దక్షిణామూర్తి తలుపు దగ్గర్నుంచి తనవేపు నడిచి వస్తున్న సుజాతని దీక్షగా చూశాడు. ఆమె జుట్టు భుజాల వరకు కత్తిరించుకుంది. జుట్టుకు నూనె రాసుకోలేదు. కట్టుకున్న చీర నైలానుదే కాని, దళసరిది. కాళ్లకి ఎత్తు మడమలుండి పాదాలను పూర్తిగా కప్పిన జోళ్లున్నాయి. ఆమె బ్లౌజ్ చీరలో దోపబడినట్టుంది. పొట్ట ఏ మాత్రం బహిర్గతం కావడం లేదు.

ఆమె దగ్గరకు వచ్చాక, "ఈ మధ్యనే విదేశాల నుంచి వచ్చినట్టున్నారు?" అన్నాడు.

"అవును," అంది సుజాత ఆశ్చర్యంగా.

"యు.ఎస్.ఎ.? కెనడా? యు.కె.? ఆస్ట్రేలియా?"

"యు.ఎస్.ఎ."

"కూర్చోండి! చెప్పండి మీకు నా నుంచి కావలసిన సహాయం ఏమిటి?"

''నాకు విడాకులు కావాలి,'' అంది సుజాత సూటిగా.

''ఈ దేశంలో మా లాయర్లతో సహా విడాకులిచ్చు కోవడాన్ని ప్రోత్సహించం.''

''అది నా అనుభవంలోకి వచ్చింది. కానీ మీకే నష్టం కదా అది!''

''నిజమే! కానీ మేము ఆ నష్టాన్ని మేరేజ్ కౌన్సి లింగ్ పేరిట వసూలుచేసే ఫీజుతో భర్తీ చేసుకుంటాం,'' అని నవ్వాడు దక్షిణామూర్తి.

''లాయర్లు డబ్బు కోసం ఏ పనైనా చేస్తారు కదా,'' అని సుజాత మాటల్లో ఉన్న ధ్వనిని గుర్తించి- అది జోక్ కింద తీసుకుని, తనూ ఆ జోక్‌ని పొడిగించాడు.

''నేను విడాకులివ్వాలనుకుంటున్నట్టు చెప్పి నప్పటి నుంచి మా అమ్మా నాన్నా, అన్నా వదినా ప్రతి ఒక్కరూ తమ పక్కలో బాంబు పేలబోతున్నట్టు బెదిరి పోతున్నారు. వద్దమ్మా అని బతిమాలుతున్నారు.''

''వాళ్లదాకా ఎందుకండీ! మీ అమ్మగారు మీ నాన్నగారికో, మీ వదిన మీ అన్నగారికో విడాకులిస్తా నంటే మీరే వద్దంటారు. నాన్న ముసలివారని, ఇన్నాళ్లూ సర్దుకున్నదానివి శేషజీవితం కూడా సర్దుకోమని మీ అమ్మకి చెప్తారు. మీ అన్న మంచివాడని మరో కొంత కాలం అతనికి అవకాశం ఇచ్చి చూడమని మీ వదినకి చెప్తారు. అవునా?''

దక్షిణామూర్తి వేసిన ప్రశ్నకి సుజాత జవాబు చెప్పడానికి కాస్త సమయం తీసుకుంది.

''అంటానేమో! కాని మా అమ్మకాని, వదినకాని ఆ నిర్ణయం తీసుకున్నప్పుడు వాళ్లు భరించడానికింక శక్తిలేకే ఆ నిర్ణయం తీసుకున్నారని అనుకుంటాను. యూ నో! విడాకులకి కారణాలు చాలామంది చాలా బలమైనవి అయి ఉండాలని నాకు చెపుతున్నారు. అక్కర్లేదు. యూకెన్ ఆల్వేస్ సిట్ మోర్ కంఫర్టబ్లీ ఆనె హిల్‌టాప్ దాన్ ఆనె పిన్ కుషన్. నసుగుడు, జడ్డితనం, సాధింపులులాంటి రోజూ ఉండే పిన్‌ప్రిక్స్ ఒకరోజు కోపంలో భర్త కొట్టిన దెబ్బలు కంటే భరింపశక్యం కానివి.''

''నిజమే వివాహితుల్లో నూటికి తొంభైమంది రోజూ విడాకుల గురించిన ఆలోచనలు చేస్తూనే వుంటారు. మిగిలిన పదిమంది వితంతువులో, విధురు లో లేక అదివరకే విడాకులు తీసుకుని సుఖపడి పోతున్నాం అనుకున్నవారో అయుంటారు. అంటే డైవోర్స్‌లు సాధారణం కాదుకానీ, వాటి గురించిన ఆలోచనలు సర్వసాధారణం. ఎంతదాకో ఎందుకు? మా ఆవిడ రోజుకు పదిసార్లు నాకు విడాకులు ఇచ్చే యాలనుకుంటూ ఉంటుంది. కానీ ఇవ్వలేదు ఎందు కని? మా పెద్దమ్మాయికే ఇంకా పెళ్లి కాలేదు. తను విడాకులిస్తే తన కూతురికి పెళ్లి కాదని భయం. తల్లి చాలు పిల్లకి వస్తుందన్న భయంతో సంబంధాలు రావే మోనని భయం. లేకపోతే నన్నే లాయరుగా పెట్టుకుని నామీద విడాకుల దావా వేసేసును. అఫ్‌కోర్స్ ఆవిడకి నామీద భర్తగా గౌరవంలేదు. కానీ లాయరుగా చచ్చేంత గౌరవం. ఈ ఇల్లూ- కారు చూస్తే ఎవరికైనా నేను మంచి ప్రాక్టీస్ ఉన్న లాయరు అనిపిస్తుంది కదా!''

సుజాత సరిగ్గా అదే అనుకునీ, అలా అనుకున్న వారు చెప్పగా వినీ దక్షిణామూర్తి దగ్గరికి వచ్చింది. దక్షిణామూర్తి తన సంభాషణ కొనసాగించాడు.

''ఇంతమంది నిత్యం విడాకుల గురించిన ఆలో చనలు చేస్తున్నా డైవోర్సులు ఎందుకు సాధారణం కాదు? ఈ ప్రశ్నకి రెండు జవాబులు తడతాయి. కోర్టులు, తాము విడదీసిన దంపతుల మీద చెరగని ముద్రలు వేస్తాయి. ఆ ముద్రల వల్ల వారు సంఘంలో ప్రత్యేకంగా కనిపిస్తారు. వీరి పట్ల ప్రత్యేకమైన అగౌరవం జనం చూపించకపోయినా, నిరాదరణ చూపిస్తారు. వెల్ క్వాలిఫైడ్ అమ్మాయిలకే పెళ్లి అవడం కష్టంగా ఉన్న ఈ రోజుల్లో విడాకులిచ్చిన అమ్మాయికి మరో పెళ్లి అవడం ఎంత కష్టం. భార్య చనిపోయిన వాడికి ఆలో చించకుండా పిల్లనిచ్చే మన దేశంలో విడాకులిచ్చిన వాడికి ఏమో, ఎల్లాంటివాడో, ఆ పిల్ల ఉత్తినే విడాకు లిచ్చి ఉంటుందా అని పిల్లనివ్వరు.''

''అయితే నన్ను విడాకులు తీసుకోవద్దంటారు!'' అంది సుజాత అసహనంగా.

''నేననేది అందరూ అనేదే! మీరీ మాటలు చాలా సార్లు వినే ఉంటారు. విడాకులు తీసుకుందామని అను కున్నంతమంది తీసుకోకపోవడానికి రెండో కారణం, నా దృష్టిలో వాళ్లకి కనిపించే బలమైన కారణం ఏదో ఒకటి ఉంటుంది. పిల్లల క్షేమం, ఆస్తి మొదలైనవి. మీ విషయంలో అటువంటి కారణం ఏమీలేదా అని ఆలో చిస్తున్నాను. అంతేకాని ఆడపిల్లకి వైవాహిక జీవితమే పరమార్థం అని అనుకోవడంవల్ల కాదు. ఆడపిల్లల తండ్రిని కదా! నేనెప్పుడూ ఆడపిల్లల పక్షమే!''

''నాకు విడాకులు కావాలి. అందుకు నాకు మీ సహాయం కావాలి. చేస్తారా?'' అని సూటిగా అడిగింది.

''మేము ఉన్నది అందుకేగదా? మీ కథ చెప్పండి. నా సలహా నేను చెప్తాను. నా సలహా విన్నాక మీరు నిర్ణయం తీసుకోండి. ఆ నిర్ణయం విడాకులే అయితే దాన్ని సాధించడానికి నేను లాయరుగా నాకు చేతనైన సాయం చేస్తాను.''

దక్షిణామూర్తి మాటలు సుజాతకి ధైర్యాన్నిచ్చాయి. 'ఈయన అందరిలాగా విడాకులు పుచ్చుకోవాలనుకోవడం పెద్ద అపరాధం అని నీతిబోధ చెయ్యలేదు,' అని సంతోషించింది. దక్షిణామూర్తిలో గొప్ప గుణం అదే. అతను అవతలి వారు చిన్నబుచ్చుకునేలా మాట్లాడడు. సుజాత తన కథ చెప్పింది.

సుజాత భర్త అమెరికాలో పిహెచ్.డి. చేసి గ్రీన్ కార్డ్ సంపాదించి అక్కడే స్థిరపడ్డాడు. మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ ఉన్న అమ్మాయి కావాలని పట్టుబట్టి సుజాతను ఎన్నుకుని పెళ్లి చేసుకున్నాడు. పెళ్లినాటికి సుజాత బి.ఇ. పాస్ అయింది- ఎలక్ట్రానిక్స్ బ్రాంచిలో ఆమెకి అమెరికాలో మంచి ఉద్యోగమే దొరికింది. ఉద్యోగం మొదటి కొద్దిరోజులు ఉత్సాహంగా గడిచాయి. నెల గడిచేసరికి ఆఫీసులో పనికి అలవాటు పడింది. అలవాటు పడింది కనుక ఆఫీసులో ఆమెకి తోటి ఉద్యోగస్తులతో పాటు సమంగా పని ఇవ్వడం మొదలుపెట్టారు. అప్పుడు సమస్యలు మొదలయ్యాయి ఇంట్లో.

సుజాత భర్తకి పూర్వంలాగా అన్నీ అమర్చలేక పోయింది. అతను సుజాత వచ్చేవరకు తను ఇంటికి ముందు వచ్చినా, 'పొయ్యి మీద బియ్యం,' అన్నా పడేసేవాడు కాదు. కాఫీ అయినా కలుపుకునేవాడు కాదు. కాఫీ తాగిన గ్లాసు సింకులో పడేసేవాడు కాదు. కూర్చున్న చోట పెట్టేసేవాడు.

సుజాత ఏమైనా అంటే- "నాకీ వంట బోరుకొట్టే కదా పెళ్లి చేసుకున్నది," అనేవాడు.

అయిదు సంవత్సరాల పాటు వండుకు తిన్న మనిషి పెళ్లవగానే కాఫీ అయినా ఎందుకు కలుపుకోడో ఆమెకి అర్థం కాలేదు.

"మా అమ్మాయికి రెండేళ్ల క్రితం ఓ అమెరికా సంబంధం వచ్చింది. పెళ్లికొడుకు మా అమ్మాయితో 'వంట బోర్ నాకు' అన్నాడట. వెంటనే మా అమ్మాయి- 'నాకూ అంతే, అందరికీ అంతేననుకుంటాను. తినకుండా ఉండలేక వండుకుంటాంకానీ,' అందిట. అతను, 'అయ్యో వండుకుని తిని అలిసిపోయావా చిట్టి తండ్రీ! నేను వచ్చి వండిపెడతాగా,' అంటుందనుకున్నాడు కాబోలు. మా అమ్మాయి అల్లా అనగానే అదే పోత. మళ్లీ మొహం చూపించలేదు. మా అమ్మాయిని మా ఆవిడ కేకలేసింది, 'అదేమిటే అల్లా అంటారా?' అంటూ. మా అమ్మాయి అంది కదా, 'వంటమనిషి కావలిస్తే వంటమనిషి కోసం చూడాలి కానీ చదువుకున్న పిల్లకోసం- అందులోనూ బాగా చదువుకున్న పిల్లకోసం వెదకడం ఎందుకట?' అని. ఇప్పటి మగపిల్లలకి తనతో సమానంగా చదువుకుని ఉద్యోగం చేయగలిగి- వాళ్ల అమ్మ, నాన్నకి అమర్చినట్టు అన్నీ అమర్చిపెట్టే భార్య కావాలి," అన్నాడు దక్షిణామూర్తి.

"నా భర్త- మీ అమ్మాయిని చూడడానికి వచ్చిన వాడిలాంటివాడే. పెళ్లి చూపులప్పుడు నాతో కాస్సేపు ఏకాంతంగా మాట్లాడాలన్నాడు. మావాళ్లు వాళ్లకి ఇల్లు చూపించే నెపంతోను, వాళ్లవాళ్లు చూసే నెపంతోను అక్కడ్నించి వెళ్లిపోయారు. అప్పుడు ఇంగ్లీషులో నా అభిమాన రచయితల గురించి, జాయింట్ ఫామిలీస్ విషయంలో నా అభిప్రాయాల గురించి ప్రశ్నించాడు. ఆపైన ముఖ్యమైన విషయం అని చెప్పి- 'నాకు ఉద్యోగం మొదటి భార్య. ఐ పే హర్ మోర్ ఎటెన్షన్. నేను చాలా ఏంబిషస్. ఉద్యోగంలో పైకి రావడానికి నేను అహర్నిశలూ పనిచేస్తాను. వీకెండ్స్‌లో కూడా అవసరమైతే ఆఫీసుకు వెళ్తాను. అందుకని నాకు- ఈ విషయంలో నా కాబోయే భార్య సహకారం కావాలి. నా కంపెనీ డిమాండ్ చేయని భార్య కావాలి. అందుకని ఉద్యోగం చేయగలిగి చేసే భార్య కావాలి. ఆమె స్వతంత్రంగా బతకగలిగినదై ఉండాలి,' అని అన్నాడు అతను. అప్పుడు నాకు అర్థం కాలేదు అతని అసలు భావం. నేనటువంటిదాన్నే అన్నాను అప్పుడందుకుని."

దక్షిణామూర్తి, "అతని అసలు భావం ఏమిటని మీ ఉద్దేశ్యం?" అని అడిగాడు.

"అతని అసలు భావం ఏమిటంటే భార్య అతని మీద ఆధారపడకుండా బజారుకు వెళ్లి వస్తువులు తెచ్చుకుని, అతని మీద ఆధారపడకుండా ఇంటిపని చేసుకునేదై ఉండాలి. అలా స్వతంత్రంగా పని చేసుకుపోవాలి అన్నాడుకదా అని స్వతంత్రంగా ఆలోచించ రాదు. అతనికంటే చిన్న ఉద్యోగం చేస్తూ- ఇల్లు నడపడానికి అతని జీతంమీద ఆధారపడుతూ- అందుకుగాను అణిగిమణిగి పడి ఉండే భార్య కావాలి. అతని ఆధిక్యాన్ని సర్వదా విస్మరించనిదై ఉండాలి."

సుజాత తన భర్త మనోభావాల్ని ఎంతో సమర్థవంతంగా విశ్లేషించింది. అయితే సుజాత భర్త ఒక్కడే ఇటువంటి వాడు కాదు. రమారమి తన కూతుర్ని చూడడానికి వచ్చిన ప్రతి కుర్రకుంకా ఇట్లాగే మాట్లాడాడు. ఇది వ్యవస్థలో వస్తున్న మార్పు. తన తరంలో వారికంటే ఈ తరంలో వారికి ఆర్థికావసరాలు హెచ్చు. తను ఇరవై సంవత్సరాలు ప్రాక్టీస్ చేసి- కారు, టీ.వీ. ఫ్రిజ్ కొంటే ఇప్పటి కుర్రవాళ్లకి అవి పెళ్లయి భార్యతో విడిగా వుండడం మొదలుపెట్టేనాటికే కావాలి. అవి తన ఒక్కడి జీతంతో సాధ్యంకాదు. అందుకని భార్య ఉద్యోగం చేసి సంపాదించాలని కోరుకుంటున్నాడు. తప్పులేదు.

అయితే తనలాగానే ఆఫీసులో పనిచేసి వచ్చే భార్యకు ఇంటిపనిలో సహాయపడడం ధర్మం అని ఆలోచించడు. చెయ్యకుండా ఉండడాన్ని తనది పెద్ద ఉద్యోగం తన జీతం ఎక్కువ అనడం కారణాలుగా చెప్పుకుని సమర్థిస్తాడు. స్త్రీకి ఇల్లు అనే పంజరంకాక ఇల్లు, ఆఫీసు, బజారులనే మూడు పంజరాలు కట్టి వాటి మధ్య వాటిని కలుపుతూ కటకటాలలో ఇరుకుదార్లు ఏర్పరచి స్త్రీకి తను స్వార్థంతో ఏర్పరచిన విశాలత గురించి చంకలు గుద్దుకొంటున్నాడు. మూడు పంజరాల మధ్య ఇరుకు మార్గాల్లో నడవలేక మరింత అలిసిపోతోంది ఈనాటి అమ్మాయి. అందుకే ఈనాటి సుజాతలు, 'నాకు విడాకులు కావాలి అంటున్నారు,' దక్షిణామూర్తి ఆలోచనలకి ఆనకట్ట వేస్తూ -

''లాయరుగారు ఏమిటో ఆలోచనల్లో పడిపోయారు!'' అంది.

''ఆడపిల్లల తండ్రిని కదా! సమస్యని మీ కోణం లోంచి చూడాలని ప్రయత్నిస్తున్నాను. కానీ పురుషుడిని కదా ఆ పని నాకు కొంచెం శ్రమగా ఉంది. నా కళ్లకున్న మసకలు నన్ను సరిగా చూడనీయడం లేదు,'' అని నవ్వాడు దక్షిణామూర్తి.

సుజాత కథ చెప్పసాగింది. సుజాత పనిలో చురుకుగా ఉండడం చేత ఆమె పని చేస్తున్న కంపెనీ ఒక సంవత్సరం తరువాత ఆమెకి జీతం పెంచి, దాంతో బాటు బాధ్యత కూడా పెంచింది. దాంతో సుజాత కొన్ని రోజులు ఆలస్యంగా ఇంటికి రావడం, శని ఆదివారాల్లో అప్పుడప్పుడు ఆఫీసుకు వెళ్లాల్సి రావడం జరుగుతూ వచ్చాయి. మొదట్లో ఆమె ఆలస్యంగా వచ్చినా ఇంటి పని తనే చేసుకుపోగలిగేది. కానీ కొన్నాళ్లకి అతని మీద కొంత అతని పని వదిలిపెట్టక తప్పలేదు. కొన్ని వీకెండ్స్ లో అతని బట్టలు ఇస్త్రీ చెయ్యడం కుదిరేది కాదు సుజాతకి. అవి అతనే ఇస్త్రీ చేసుకుంటే బావుండునను కునేది సుజాత. కాని అతనికి ఆ పని బోర్. అతను ఇంటిపని చేసుకోలేనప్పుడే పెళ్లి చేసుకున్నాడు. కానీ అతను ఇంట్లో పనీపాట చేసుకోగలిగిన భార్యను కాక ఉద్యోగం చెయ్యగలిగిన భార్యను కోరుకున్నాడు. ఇల్లు కొనడానికి అతను చేసిన అప్పు త్వరగా తీర్చుకోవాలంటే భార్య సంపాదనాపరురాలు కావాలని అతను లెక్కలు వేసుకున్నాడు. సుజాత తను ఆఫీసులో పనీ, ఇంటి పనీ రెండూ చెయ్యలేకపోతున్నాననీ, కావాలంటే ఉద్యోగం మానేస్తాననీ చెప్పింది.

''నువ్వు మరీ బద్ధకస్తురాలివి. పొద్దుట్నించీ సాయంత్రందాకా ఇంట్లో ఉండి సాయంత్రం నేనింటికి రాగానే నన్ను అక్కడికీ, ఇక్కడికీ తీసుకు వెళ్లండంటూ వేధించుకుని తినడానికే నువ్వు ఉద్యోగం మానేస్తానంటున్నావు!'' అంటూ అతను ఒప్పుకోలేదు.

''ఉద్యోగం అంటూ చేస్తూ ఉంటే అది సరిగ్గా చెయ్యడం, తోటివారితో పోటీ, రాట్ రేసూ తప్పవు కదా! అందుకని మీరు సర్దుకోవాలి మరి,'' అంది సుజాత.

''ఏదో ఉద్యోగం చెయ్యమన్నాను కానీ నిన్ను ప్రమోషన్లు తెచ్చుకుని, కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు అవమన్నానా? నీకింతకంటే డబ్బు అవసరంలేదనీ, నీకు ఏంబిషన్స్ లేవు అనీ మీ బాస్‌తో చెప్పు,'' అన్నాడు అతను.

''మీకు మాత్రం ప్రొఫెషన్ ఫస్ట్‌వైఫ్. మీరు ఏంబిషస్. మీరు జాబ్‌లో పైకి రావాలి. మీ భార్య మీ అవసరమైన మేరకు సంపాదించి మీరింటికి వచ్చే సమయానికి ఇంట్లో ఉండి, మీరు కంపెనీ కోరినప్పుడు అందిస్తూ- మీరు బిజీగా ఉంటే అర్థం చేసుకుని ఇంట్లో పడి ఉండాలా? నేనూ మీ అంత తెలివైనదాన్నే! పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకుని పాస్ అయినదాన్నే! ఉద్యోగంలో సమర్థురాలిననే పేరు తెచ్చుకున్నాను. నాకెందుకు ఏంబిషన్ ఉండరాదూ?''

''నేను పెళ్లికి ముందే చెప్పాను.''

''ఏం చెప్పారు? నేను మీకు అడ్డు రాకూడదని చెప్పారు. ఉద్యోగం చెయ్యాలని చెప్పారు. చేస్తే మీరు చెప్పిన మేరకే చెయ్యడం సాధ్యం కాదనీ, మీరు నాకు అడ్డు వస్తున్నారనీ ఇప్పుడు నేను మీకు చెపుతున్నాను.''

ఈ విధమైన వాగ్వాదాలు, పోట్లాటలు వారిద్దరి మధ్యా చాలాసార్లే జరిగాయి. సుజాత భర్త సుజాత వాదాన్ని అంగీకరించలేదు. తనది పెద్ద ఉద్యోగం. పెద్ద జీతం కనుక దానికే ప్రాధాన్యం ఉండాలన్నాడు. సుజాత సహకరించకపోతే తన పురోగతి ఆగిపోతుందన్నాడు. అతని వయస్సు ఇప్పుడెంత ఉందో అంత వయస్సు తనకి వచ్చినప్పుడు తను కూడా పెద్ద ఉద్యోగంలో ఉంటానని (అతను) పెద్ద ఉద్యోగంలో ఇప్పుడు ఉండడంలో పెద్ద విశేషమేమీ లేదని అంది సుజాత.

మనిషి రక్తం రుచి చూసిన పులి, సంపాదన రుచి చూసిన ఆడది ఒకలాంటివారేనన్నాడు అతను. సుజాత కావచ్చునంది.

ఈవిధంగా ఆ ఇద్దరి మధ్యా పోట్లాటలు జరుగుతూ ఉండడం, ఇద్దరూ ఏకాభిప్రాయానికి రాలేక పోవడంవల్ల సుజాత తను ఇండియా వచ్చేశానంది.

''అతని భార్యగా సంపాదించుకున్న వీసాతో అక్కడ ఉండడం ఇష్టం లేకపోయింది. ఈసారి వెళ్తే సుజాతగా వెళ్తాను,'' అంది సుజాత.

''మీ తగవు తీర్చడానికి మీ అత్తమామలు ప్రయత్నించలేదా?'' అని అడిగాడు దక్షిణామూర్తి.

"ప్రయత్నించారు. కానీ ఆ ప్రయత్నాలు ఫలించడం అసంభవమని నాకు ముందునుంచే తెలుసు. అదే జరిగింది."

"ఎందుకని అసంభవమనుకున్నారు?" ఆశ్చర్యంగా అడిగాడు దక్షిణామూర్తి.

"ఆ సెటప్ అలాంటిది. మా అత్తగారు పెద్దగా చదువుకోలేదు. ఆవిడకి మావగారో పెద్ద హీరో. ఆయనంత తెలివైనవాడు, మంచివాడు మరొకళ్లు ఉండవచ్చునని ఎవరైనా అంటే కూడా ఒప్పుకోలేదు. ఆయన నిజంగా తెలివైనవాడే. చెడ్డతనం ఏమీలేదు కూడాను. మంచి ఉద్యోగం చేసేవాడు- అందుకని మా మావగారిని ఏ పనీ ముట్టుకోనీయకుండా అన్నీ అమర్చిపెట్టేది. ఆవిడకిద్దరూ మగపిల్లలే కలిగారు. ఆవిడకి వేరే ప్రపంచం లేకపోవడంచేతా, మగవాళ్ల ఆధిక్యాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించడం వల్లనూ ఆవిడ వాళ్లను అపురూపంగా పెంచింది. చొక్కాలకి గుండీలు కుట్టిపెట్టడం దగ్గర్నుంచీ షేవింగ్ నీళ్లు అందించడం, బ్రష్, రేజర్ కడిగి పెట్టడందాకా అన్నీ చేసిపెట్టేది. నాకు పెళ్లయ్యాక అమెరికా వెళ్లేముందు నెలరోజులు వాళ్లింట్లో ఉన్నాను. ఆవిడ ఆ ఇంటి పద్ధతులు చాలా గొప్పవని, అవి అలవరచుకోవాలని నాకు ఇంటెన్సివ్ ట్రెయినింగ్ ఇచ్చింది. ఆ నెలరోజులూ- కొత్త, మొహమాటంవల్లా- మోజువల్లా ఆవిడ నాచేత చేయించిన పనులన్నీ చేశాను. కాఫీ గ్లాసులందించడం దగ్గర్నుంచి తాగిన గ్లాసు అందుకోవడం దాకా!"

"అంటే మీ అత్తగారు, మావగారు కాంప్రమైజ్‌కి వారి ప్రయత్నంగా మిమ్మల్నే సర్దుకోమని సలహా ఇచ్చారా?"

"ఎస్ ఎండ్ నో. మా అత్తగారికి మా గొడవలు తెలియగానే అమెరికా వచ్చారు. వచ్చి వాళ్ల వంశంలో ఏ కోడలూ ఇంటిపని కారణంగా విడాకులిస్తాననలేదన్నారు. ఏ కారణంగా ఇస్తామన్నారు, ఇస్తామన్నవాళ్లు అని అడిగాను. దాంతో అసలు ఏ కారణంగానూ అనలేదని అన్నారు. అయితే ఆ ఇంటి కోడళ్లు అనకపోయినా అన దగ్గ కారణాలు పూర్వం నుంచి ఆ ఇంటి మగవాళ్ల విషయంలో ఉంటాయని అవి ఆవిడకి తెలిసే ఉండాలి అన్నాను. ఆవిడ బిత్తరపోయింది. ఆఖరికి ఈవిధంగా ఆలోచించిన మొదటి కోడలిని నేను అంది.

"అప్పుడు నేను అన్నాను. ఆ ఇంటి కోడళ్లలో కాపురానికి అమెరికా వెళ్లిన వాళ్లలో నేనే మొదటిదాన్ననీనూ, వెళ్లి అమెరికాలో ఉద్యోగం చేసిన వాళ్లలో కూడా మొదటిదాన్ననీనూ. 'అందుకని మరీ గొప్పలుపోకు,' అందావిడ కోపంగా. 'పోనీ మీరు ఊఁ అంటే ఉద్యోగం మానేస్తాను' అన్నాను. ఆవిడ, 'మానెయ్యి,' అంది. 'నేను సరే,' అన్నాను.

"సుజాత ఉద్యోగం మానేస్తే అప్పులెల్లా తీరుతాయి! అన్నాడు నా భర్త. అప్పుడు మా అత్తగారికి సమస్య కొద్దిగా అర్థమయింది. కానీ మా అత్తగారు నా భర్తకి ముప్పై సంవత్సరాలపాటు కొత్త అవసరాలు, పరిస్థితులు ఉన్న ఈ రోజులలో బతకడానికి అవసరం అయిన ట్రెయినింగ్ ఇవ్వలేదు. కానీ నేనావిడదగ్గర వున్న ముప్పైరోజులూ నా భర్తకి అనుగుణంగా నన్ను మలచడానికి శాయశక్తులా ప్రయత్నించింది. ఆ పక్షపాత ధోరణివల్ల మంచి ఫలితాలు రావడం కష్టం. నేను ఆవిడ రూపొందించిన సూత్రాలను పాటించకుండా ఎదురుతిరగడంతో ఆవిడ అప్రతిభురాలై తన కొడుకుకి గుండీలు కుట్టుకోవడం, కాఫీ కాచుకోవడం నేర్పబోయింది. అవి నా భర్తకి రాకపోతే అయిదేళ్లపాటు అమెరికాలో ఒంటరిగా ఎల్లా ఉన్నాడు? వచ్చు. భార్య వచ్చాక చెయ్యక్కర్లేదు అన్న భావం- భార్యే చేస్తుందన్న భావం ఆవిడకి తెలియకుండానే కొడుకు తన దగ్గర ఉన్న పాతిక సంవత్సరాలలో కలిగించింది. ఆ భావం మానై కూర్చుంది. అతను మారలేదు."

సుజాత తన అత్తగారు చేసిన ప్రయత్నాల నుంచి పెద్దగా ఫలితాలను ఆశించలేదు. కనుక ఆశాభంగం పొందలేదు. భరించినంత వరకు భర్త జడ్డితనం భరించి, భరించలేకపోయినప్పుడు తన జీతంతో తను టికెట్ కొనుక్కుని ఇండియా వచ్చేసింది.

"మరి మీ తల్లిదండ్రులు మీ నిర్ణయాన్ని సమర్థించారా?" లాయర్ దక్షిణామూర్తి ప్రశ్నించారు.

"లేదు. నెత్తీ నోరూ మొత్తుకున్నారు," అంది సుజాత.

ఆమె తల్లిదండ్రులు సుజాత ఇండియా వచ్చినందుకు సంతోషించారు. ఆ సంతోషం ఆమె వచ్చిన కారణం తెలియగానే హరించుకుపోయింది. "సర్దుకుపో అమ్మా!" అని సుజాతతో అన్నారు.

"మా పిల్ల చిన్నపిల్ల. తెలియక భర్తని విడిచిపెడుతానంటోంది. మీరు పెద్ద మనస్సుతో సుజాత తప్పిదాన్ని క్షమించి దాన్ని మీ కడుపులో పెట్టుకోండి," అంది సుజాత తల్లి ఆమె అత్తగారితో.

సుజాత వదిన సుజాతతో- "ఆడవాళ్లం మనమే ఎల్లాగో సర్దుకోవాలి. నేను పెరిగిన వాతావరణం, మీ ఇంటి వాతావరణం మాత్రం ఒక్కలాంటివా? నేను మాత్రం ఉద్యోగం చెయ్యడం లేదా? మీ అన్నకి మాత్రం అన్నీ చేతికి అందించక్కర్లేదా?" అంది.

"ఒప్పుకుంటాను. నీకింటి పనిలో సాయం చెయ్యడానికి మా అమ్మ ఉంది. అవసరమైతే రెస్టు

తీసుకోవడానికి పుట్టిల్లుంది. నాకీ రెండూ అమెరికాలో లేవు. అన్నీ నాకు భర్తే. ఏడిపించినా భర్తే. ఓదార్చినా భర్తే. చంపుకుతిన్నా భర్తే. సహాయం చేసినా భర్తే చెయ్యాలి. అయినా నీకు మా అన్నయ్యతో కలిసి ఉండడం నీ శక్తికి మించిన పనైతే- ఉండమని మాత్రం నేను సలహా ఇవ్వను,'' అంది సుజాత.

సుజాతను తీసుకువెళ్లి అత్తగారింట్లో దింపుదామని చూశారు ఆమె పుట్టింటివారు. సుజాత పడనియ్యలేదు. ఆమె నిర్ణయం మారలేదు. లాయర్‌ని వెతుక్కుంటూ దక్షిణామూర్తి దగ్గరకు వచ్చింది.

''మీ భర్త అమెరికాలోనే ఉన్నారా? ఇండియా వచ్చారా?'' అని దక్షిణామూర్తి అడిగాడు.

''అమెరికాలోనే ఉన్నారు. ఎందుకు?'' అని అడిగింది సుజాత.

''దావా ఎక్కడ తేవాలి అన్నది దానిమీద ఆధారపడి ఉంటుంది. ఆయన అమెరికాలో ఉంటే దావా మీకు పెళ్లయిన ఊర్లోగాని, మీ స్వంత ఊర్లోగాని వెయ్యవచ్చు. ఇండియాలో ఉంటే ఆయన ఉన్న ఊళ్లో లేక చివర్లో మీరు కలిసి ఉన్న ఊర్లో వెయ్యాలి. అందుకు.''

''మాకు పెళ్లయిన ఊరు హైదరాబాద్. అప్పుడు మా నాన్నగారు ఉద్యోగరీత్యా అక్కడున్నారు. కాని ఇప్పుడు రిటైరై ఈ ఊళ్లోనే ఉంటున్నారు. ఇది మా స్వంత ఊరు,'' అంది సుజాత.

''ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. మీరు శ్రమ అనుకోకుండా రేపు వస్తే కాగితాలు తయారు చెయ్యవచ్చు,'' అన్నాడు.

సుజాత లేచి సెలవు తీసుకొని వెళ్లిపోయింది. వాది మనస్సు మార్చుకోవడానికి లాయరిచ్చిన ఆఖరి అవకాశం అది. కొంతమంది మర్నాడు రారు.

రాత్రి భోజనాలయ్యాక దక్షిణామూర్తి భార్య, ''పెద్దదానికి పాతిక నిండాయి. రెండోదానికి ఇరవై మూడు నిండాయి. ఇంకా మనం పెద్దదానికే పెళ్లి చెయ్యలేకపోయాం. దానీడు వాళ్లు పిల్లాపాపలతో కళకళలాడుతుంటే మీకు చీమ కుట్టినట్టయినా లేదు. కాని తల్లిని నా మనసెంత బాధపడుతోందా తెలుసా!'' అని సాధింపు మొదలెట్టింది.

''దానికేమిటోయ్! హాయిగా ఉద్యోగం చేసుకుంటోంది. దానికి తగినవాడు మనకింకా తగల్లేదు. కానీ ఎక్కడో ఉన్నాడు. ఘడియ రాగానే వచ్చి మన తలుపు తడతాడు. మనం చెయ్యాల్సిందల్లా పైవాడిమీద భారం వేసి కూర్చోటమే!'' దక్షిణామూర్తి భార్యమీద అస్త్రం ప్రయోగించి- ''అయినా మనం పెళ్లి సంబంధాలు చూస్తూనే ఉన్నాంకదా! ఏదో ఒకటి అని చేస్తే రేపు అది విడాకులంటుంది. ఇవ్వాళే ఓ అమ్మాయి విడాకులు కావాలంటూ వచ్చింది. వాళ్లమ్మ తొందరపెడితే వాళ్ల నాన్న ఆ సంబంధం చేసి ఉంటాడు,'' అన్నాడు దక్షిణామూర్తి.

''చాల్లెండి... అన్నట్టు మీ సుబ్బారావుగారి భార్య కనిపించింది నిన్న. ఆవిడ చెప్పింది. రెండేళ్ల క్రితం మన అమ్మాయిని చూడటానికి వచ్చాడే వాళ్ల చుట్టాలబ్బాయి రఘు, అతని పెళ్లాం అతనికి విడాకులిస్తానంటోందిట. ఆ పిల్లాడి తల్లి అప్పుడు దక్షిణామూర్తిగారి అమ్మాయిని చేసుకొన్నా బావుండిపొయ్యేది అందిట ఈవిడతో.''

''అప్పుడు చేసుకోలేదు కదా! ఇప్పుడీ మాటెందుకు. పాపం ఆ పిల్ల వీళ్లతో ఎంత విసిగిపోయిందో!''

''లేదుట. ఆ పిల్లకీ సంబంధం మొదటి నుంచి ఇష్టం లేదు. ఏదో లవ్ ఎఫైర్ ఉందిట.''

దక్షిణామూర్తికి రఘు వచ్చి తన కూతుర్ని చూడటం తాలూకు తతంగం అంతా గుర్తుకు వచ్చింది.

సుబ్బారావు, దక్షిణామూర్తి తోటి లాయరు. అతను చెప్పాడు. మా చుట్టాలబ్బాయి రఘు అని అమెరికాలో ఉన్నాడు. రత్నంలాంటి కుర్రాడు. వచ్చేనెల ఆ పిల్లవాడు ఇండియా వస్తాడని, అప్పుడు పెళ్లి చెయ్యదలుచుకొన్నామని, మంచి సంబంధం ఒకటి చూడమని రఘు అమ్మా, నాన్నా నాతో అన్నారు,'' అని.

''అబ్బాయి ఏం చేస్తున్నాడు?'' అని దక్షిణామూర్తి అడిగితే,

''మంచి ఉద్యోగంలో ఉన్నాడు. ప్రాస్పెక్టివ్ గ్రీన్‌కార్డ్ హోల్డర్. అతనికి ప్రొఫెషనల్‌గా క్వాలిఫికేషన్ ఉన్న అమ్మాయి కావాలి. మీ అమ్మాయి గారంటీగా వాళ్లకి నచ్చుతుంది. వాళ్లు మీ అమ్మాయిని అటూ ఇటూ చూడకుండా చేసుకునేలా నేను చూస్తాను. మీ కిష్టమైతే ఈ అడ్రస్‌కి ఉత్తరం రాయండి,'' అన్నాడు సుబ్బారావు.

దక్షిణామూర్తి రఘు తండ్రికి తన కూతుర్ని రఘు కివ్వాలని ఉందని ఉత్తరం రాశాడు. దానికి జవాబు రాలేదు. సుబ్బారావు కనుక్కొంటే-

''ఒక్క సంబంధమే వచ్చింది ఇప్పటికి. కనీసం పది పన్నెండైనా వస్తే మేం స్క్రీన్‌చేసి ఓ మూడు నాలుగు అబ్బాయికి చూపిస్తాం. అందులో వాడు ఒకటి చేసుకొంటాడు,'' అన్నారుట. కనీసం మర్యాదకి ఆ విషయం తనకివాళ్లే డైరక్టుగా తెలియజేసి ఉంటే బావుండేది అనుకొన్నాడు దక్షిణామూర్తి.

రఘు చుట్టాలందరూ విజృంభించి- ''మావాడొకడు అమెరికా నుంచి వస్తున్నాడు. మీ పిల్లనివ్వండి. మీ పిల్ల అతనికి నచ్చుతుందనే మా నమ్మకం,'' అంటూ

ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్స్ ఉన్న ఆడపిల్లలకోసం ఆంధ్రా అంతా వలలు వేయటం మొదలుపెట్టారు.

ఆ తరువాత 'వాడికి ఉద్యోగంలో ప్రమోషన్ రావాలిట. ఇప్పుడే రాడు,' అని, 'గ్రీన్‌కార్డుకి అప్లై చేశాడు. అందుకని దేశం వదలటానికి అవదు,' అనీ చెపుతూ వచ్చారు.

''మేము స్క్రీన్‌చేసి సెలెక్ట్ చేసిన నలుగురు అమ్మాయిల్లో మీ అమ్మాయి ఒకత్తి. జాతకాలు నప్పాయి. మా అబ్బాయి తన పి.సి. మీద మీ అమ్మాయి క్వాలిఫికేషన్స్, తన రిక్వైర్‌మెంట్స్ మాచ్ చేసి చూసు కుంటే కొరిలేషన్ కోయఫిషెంట్ 0.9 దాకా వచ్చింది. మీ సంబంధం గురించి మేము చాలా సీరియస్‌గా వున్నాము. అయితే మా అబ్బాయి ఇండియాలో ముప్పై రోజులే ఉంటాడు. అందులో మొదటి పదిరోజుల్లో పిల్లని సెలెక్ట్ చేసుకొని, రెండో పదిరోజుల్లో పెళ్లి చేసు కొని, మూడో పదిరోజుల్లో మాతోనూ, అతని అత్తా మామలతోనూ గడిపి అమెరికా వెళ్లిపోతాడు. కనక మీరు వచ్చి మీ అమ్మాయిని హైదరాబాద్‌లో చూపిస్తే పిల్లవాడికి టైము సేవ్ చేసినవారవుతారు. పైగా రఘు జెట్‌లాగ్, ఫుడ్ అండ్ వాటర్ ప్రాబ్లెమ్స్‌తో బాధపడు తున్నాడు,'' అని రాశాడు.

దక్షిణామూర్తికి తప్పలేదు. సంప్రదాయం పేరిట అతను బిగుసుకుపోదల్చుకోలేదు. 'మేము హైదరా బాద్‌కి పిల్లని తీసుకువచ్చి మీ ఇంట్లో మీ అబ్బాయిని చూస్తాము,' అని రాశాడు.

దానికి వెంటనే- 'అది సంప్రదాయం కాదు. మీరు హైదరబాద్ వచ్చి ఎక్కడున్నారో తెలియజేస్తే అక్కడికి వచ్చి మేమే చూస్తాము,' అని రాశాడు రఘు తండ్రి.

ముగ్గురు మనుషులు హైదరాబాద్ వెళ్లి రెండు మూడ్రోజులుండి రావటానికి కనీసం వెయ్యి రూపాయ లువుతుంది. అది తను పెట్టుకొంటే, ఆటోకి లేక పెట్రోల్‌కి రఘు తండ్రి పదిరూపాయలు పెట్టుకొని సంప్రదాయం పాటిస్తాడుట అని దక్షిణామూర్తి గునిశాడు. కాని సుబ్బారావు- ''పాపం! వాళ్ల ఇబ్బంది చాలా జెన్యువిన్ వెళ్లండి,'' అని వాళ్లని హైదరాబాద్ పంపించాడు.

దక్షిణామూర్తి ఉంటున్న హోటల్‌కి రఘు తల్లి దండ్రులతో వచ్చాడు. పిల్లవాడు బాగున్నాడు పొడుగ్గా. కాసేపు పరిచయాలు జరిగాయి. ఆపైన రఘు-

''నేను మీ అమ్మాయితో ఏకాంతంగా మాట్లా డాలి. టాంక్‌బండ్ మీదకి వాక్ వెళ్తాం. మీకభ్యం తరమా?'' అని అడిగాడు.

''మా అమ్మాయి ఉద్యోగం చేస్తోంది. ధైర్యస్థు రాలే. మగవాళ్లతో ఫ్రీగా మాట్లాడనూగలదు. తగు దూరంలో ఉంచనూగలదు. మీ గురించి తెలియక పోయినా, మా అమ్మాయి మీద మాకు పూర్తి భరోసా ఉంది. యూ కెన్ టేక్ హర్,'' అన్నాడు దక్షిణామూర్తి.

అతని జవాబుకి రఘు ముఖం చిన్నది చేసు కొన్నాడు. దక్షిణామూర్తి భార్య భయం భయంగా చూస్తూ ఊరుకున్నది.

అప్పుడు రఘు తల్లి వాళ్ల గురించి చెప్పింది. వాళ్లు ఆడపిల్లలు చదువుకోడం, ఉద్యోగం చెయ్యటం ప్రోత్సహిస్తారట. కాని క్లబ్‌లు, పార్టీలు, డాన్సులు ఇష్టం ఉండవుట. వాళ్ల కోడలు రోజూ దేవుడికి దీపం పెట్టేదై ఉండాలిట. కాని చాదస్తంగా పూజలు, పునస్కారాలు అంటూ మడి కట్టుకునేదైతే వాళ్లకి నచ్చదుట. అలా అని దేవుడనేవాడే లేడనే నాస్తికురాలు కాకూడదుట. వాళ్లకి అనాగరికులైన కోడలు పనికిరాదుట. వాళ్లలాగా సివిలైజ్డ్ అండ్ ఫార్వర్డ్ టైపు కావాలి. అంతేగాని, నాగరికత వెర్రితలలు వేస్తే ఇష్టం ఉండదుట. ఏదీ తక్కువ కాకూడదు. ఎక్కువా కాకూడదు. సమతూకం లో ఉండాలి- మా ఇంట్లో ఉన్నట్టు, అని చెప్పింది.

ఆవిడ సమతూకానికి తమ అలవాట్లని నిర్వ చనంగా ఇవ్వటం దక్షిణామూర్తికి నవ్వు తెప్పించింది. ప్రతివాళ్లూ సమతూకానికి తమ జీవితం నిదర్శనం అను కొంటూ ఉంటారు. కాని, 'మేం ఏంచేస్తే అదే ఘన కార్యం' అని బయటికి అనగలిగిన హిపోక్రసీ కేవలం పెళ్లికొడుకు తల్లిదండ్రులకి మాత్రమే ఉంటుంది అనుకొన్నాడు.

రఘు దక్షిణామూర్తి కూతుర్ని వెనక్కు తీసుకు వచ్చి దింపేసి తన తల్లిదండ్రులతో వెళ్లిపోయాడు.

''మీకు మా నిర్ణయం కొద్దిరోజుల్లో తెలియజేస్తాం. ఇంకా ఇద్దరమ్మాయిల్ని చూడాలి,'' అన్నాడు రఘు తండ్రి వెడుతూ.

వీళ్లకి అమ్మాయి నచ్చిందంటే మళ్లీ ఇచ్చి పుచ్చు కోవడాలు మాట్లాడుకోడానికి ఈ ఊరు రావాలా దేవుడా అనుకొన్నాడు దక్షిణామూర్తి. పెళ్లివారిని వెళ్లనిచ్చి- ''అబ్బాయి నీతో ఏం మాట్లాడాడే?'' అని అడిగింది దక్షిణామూర్తి భార్య కూతుర్ని.

''నాకు అమెరికాలో చదువుకోవడం ఇష్టమేనా అని అడిగాడు. అతను గ్రీన్‌కార్డు హోల్డర్ అవటంవల్ల పెళ్లి చేసుకొన్నా నాకు వీసా రావటానికి రెండేళ్లు పడు తుందిట. అందుకని స్టూడెంట్ వీసా మీద వస్తే అక్కడ మళ్లీ దొంగ పెళ్లి చేసుకొని నేను గ్రీన్‌కార్డు తీసుకోవటం సులభంట. తనకి వంట బోర్ అన్నాడు. నాకూ బోరే అన్నాను. హర్ట్ అయినట్టు పెట్టాడు మొహం.

''నాకు ఏ ఇంగ్లీషు రచయితలిష్టం అని అడిగాడు. వోడ్‌హౌస్‌లాంటి కొన్ని పేర్లు చెప్పాను. తనకి సీరియస్ రచయితలిష్టం అన్నాడు. నాకిష్టం లేదన్నాను. తను పార్టీలో ఎప్పుడైనా తాగుతాడట! కాని తాగుడు పెద్దగా ఇష్టం లేదన్నాడు. ఇంట్లో తాగనన్నాడు. తాగడం అంటూ చేశాక అది వీధిలో చేసినా, ఇంట్లో చేసినా ఒకటేకదా! తాగుడు మోతాదు మించా, తక్కువా అన్నదే ప్రశ్న. కాని, ఎక్కడన్నది ముఖ్యంకాదు అన్నాను. తను ఏంచేసినా లిమిట్స్‌లో చేస్తానన్నాడు. వాటీజ్ యువర్ లిమిట్ దెన్ అన్నాను. దానికి హర్ట్ అయినట్టు మొహం పెట్టాడు. ఏమైనా నన్ను చూసి కొంచెం బెదిరినట్టని పించింది,'' అంది ఆమె.

''అలా ఎందుకు చేశావే?'' అంది తల్లి నోరు నొక్కుకుంటూ.

''ఇంతకూ, అమ్మా! అతను అమెరికా వదలి నెలకుపైనే అయింది. దార్లో యూరప్ అంతా చూసుకునీ, హాంగ్‌కాంగ్‌లో షాపింగ్ చేసుకుని వచ్చాడు తెలుసా?'' అంది దక్షిణామూర్తి కూతురు.

''ఆరి బడుద్ధాయి! దేశాలు చూడటానికి టైముందా? పెళ్లికూతుళ్లని వాళ్ల ఊళ్లు వెళ్లి చూడటానికి లేదా! అన్ని ఊళ్లు తిరిగితే రాని కడుపునొప్పి మన ఊరు వస్తేనే వస్తుందా!'' అని దక్షిణామూర్తి భార్య ఆశ్చర్యపోతూ అంది.

''వాళ్లు నలుగురిని చూస్తున్నామంటే లిటరల్‌గా అయి ఉండదు. నలుగురినీ చూడద్దూ అని అయి ఉంటుంది'' అన్నాడు దక్షిణామూర్తి.

రఘు నిజంగానే బెదిరిపోయాడు. ఆమాటే సుబ్బారావు వచ్చి, ''మీ అమ్మాయి టూ ఇండివిడ్యువలిస్టిక్ అనుకొన్నారు,'' అంటూ మరోలా చెప్పాడు.

ఇదంతా దక్షిణామూర్తికిప్పుడు భార్య మాటల వల్ల గుర్తుకు వచ్చింది. సుజాత విడాకులిస్తానంటున్నది రఘుకి కాదుకదా అనుకున్నాడు. రఘు ఒక్కడే అమెరికాలో లేడని, అటువంటివాళ్లు అక్కడ చాలామందే ఉన్నారని అనుకుని సరిపెట్టుకున్నాడు.

మర్నాడు సుజాత వచ్చింది. ''నేను మనసు మార్చుకోలేదు. నిన్న మరో విషయం చెప్పటం మరిచిపోయాను. మా ఆయన నన్ను చూడటానికి వచ్చే ముందరే జర్మనీ, స్విట్జర్‌లాండ్ చూసి వచ్చాడు.''

''జెట్‌లాగ్, కడుపునొప్పితో బాధపడుతూ వచ్చాడా?'' అని అడిగాడు దక్షిణామూర్తి అనుమానంగా.

''అవి మైనర్! మీరు పెళ్లిచూపులకి వెడుతూ కాశ్మీర్ చూసి వచ్చిన పెళ్లికొడుకు గురించి ఏమని అనుకుంటారు? మోస్ట్ అన్‌రొమాంటిక్ ఫెలో అని కదా! ఎవడైనా పెళ్లి చేసుకుని పెళ్లాంతో వెళ్తాడు. దానికోసం సెలవు, డబ్బూ దాచుకుంటాడు. మా ఆయన అందుకు విరుద్ధం. హైలీ సెల్ఫ్ సెంటర్డ్ ఫెలో! రెండూ ఖర్చు పెట్టుకుని వచ్చాడు నన్ను చూడటానికి.''

ఇదో కొత్త కోణం. తాము రఘు రొమాంటిక్ నేచర్ గురించి ఆలోచించలేదు.

''మీ ఆయన పేరు రఘూ కాదు కదా!'' అన్నాడు దక్షిణామూర్తి అనుమానంగా.

''అవును. ఏం? అతను చూసిన డజను అమ్మాయిల్లో మీ అమ్మాయీ ఉందా?'' అంది నవ్వుతూ సుజాత. ఆమె ముఖంలో నిన్నటి బెంగ లేదు.

దక్షిణామూర్తి తలూపాడు.

''హైదరాబాద్‌లో అతని ముందర ప్రొఫెషనల్లీ క్వాలిఫైడ్ అమ్మాయిల్నందరినీ బ్యూటీ పెరేడ్‌లోలాగా తెచ్చి మార్చ్ చేయించారు అతని చుట్టాలూ, వాళ్ల కుటుంబ స్నేహితులూను. మీ అమ్మాయికి ప్రొఫెషనల్ క్వాలిఫికేషన్ ఉండి అప్పటికి పెళ్లికాకుండా ఉంటే వాళ్ల నెట్‌లో పడే ఉండాలి.''

''పడ్డాం,'' అన్నాడు దక్షిణామూర్తి.

''మీ అమ్మాయిని మొదటి పదిరోజుల్లో మొదటి భాగంలో చూశారా? చివరి భాగంలోనా?'' అని అడిగింది సుజాత.

''చివరి భాగంలోనే!'' అన్నాడు దక్షిణామూర్తి.

''అనుకున్నాను. అంతపనీ చెయ్యగలవాళ్లే! అప్పటికే నేను నచ్చినట్లు మా వాళ్లతో చెప్పి, మిగిలిన సంప్రదింపులు మొదలుపెట్టాకే మీ అమ్మాయిని చూశారు. వాళ్లకి శ్రమ లేదుకదా! మీరు కష్టపడి, ఖర్చు పెట్టి వెళ్లి చూపించారు. వద్దనటం ఎందుకు? మీ అమ్మాయి నాకంటే అందంగా ఉంటే ఏదో కారణం చెప్పి నన్ను వద్దనేవారు. మా మావగారు నాకు లెక్చరిచ్చాడు పెళ్లిచూపులు సెలక్షన్ ప్రాసెస్ కాదని, మాచింగ్ ప్రాసెస్ అని. మాచింగ్ ప్రాసెస్ అయితే నచ్చాక ఇంకోళ్లని చూడటం ఎందుకట? బెటర్ మాచింగ్‌కా? ఇది సెలక్షన్ ప్రాసెస్ కాకపోతే ఏమిటిట నా బొంద! హిపోక్రసీ దై నేమ్ ఈజ్ మై ఇన్ లాస్,'' అంది సుజాత.

దక్షిణామూర్తి మరి మాట్లాడకుండా కోర్టు కాగితాలు తీసి ఫైలు మీద, 'సుజాత విడాకుల కేసు,' అని వ్రాశాడు.

*ఆంధ్రప్రభ వారపత్రిక, 11 సెప్టెంబర్ 1991*